విజయదశమి : అక్టోబరు 24

# నవరాత్రుల్లో లలితా పారాయణం



ఎంతో గొప్పవి కదా! అని లలితా సహస్రనామాలని ఈ దేవీ నవరాత్ర కాలంలో చదవడానికి ప్రారంభించబోతూ ఓ కొందరికిగాని చెప్తే- అమ్మో! లలితా సహస్రాలా? అందరూ చదవకూడదట!- అని ఒకరూ, చదవడంలో ఏవయినా తప్పులుగాని వస్తే- అమ్మ నెత్తి అణుస్తుందిట- అని మరొకరూ, అయినా ఒకటా, రెండా?

పదిరోజులపాటు ఆపకుండా చదవాలంటే ఓ రోజు కుదురుతుంది, ఓ రోజు కుదరకపోతుంది- ఎందుకీ ఇబ్బంది? అని ఇంకొకరూ, ఏమోనమ్మా! ఆ ప్రసాదాలూ ఇంటికి వాళ్ళ వీళ్ళ రాకపోకలూ, రుచిగాని సరిలేకపోతేవెక్కిరింపులూవేళాకోళాలూ? ఇవన్నీ ఎందుకు? అని మరికొందరూ అనడం విన్పిస్తూంటుంది.

‘లలితా సహస్రనామాలని అందరికీ చెప్పకూడదనీ, అందరూ వినకూడదనీ ఆ సహస్ర నామాలలోనే ఉందిట!’ అనే చివరి ఆమె ముక్తాయింపుతో, భయంతో, అధైర్యంతో చదవకుండా ఆగిపోయే స్త్రీలు ఎందరో నేటికీ కనిపిస్తుంటారు.

ఎందరో రాక్షసులను ధైర్యసాహసాలతో వధించి లోక కల్యాణాన్ని అమ్మచేస్తే-ఆ అమ్మ భక్తుల్ని ఇలా పిరికిపందల్లా చేసెయ్యడం ఎంత ఘోరం! నేరం దారుణం!! పైగా ‘లలితా సహస్రనామాలని చదవకూడదనే మాట ఆ లలితా సహస్రాల్లోనే ఉందిట’ అనగానే నమ్మెయ్యడమేనా? నిజంగా ఈ మాటే ఆ నామాల్లోనే ఉంటే ఆ మాటని చెప్పడానికయినా ఎవరో ఒకామె చదివి ఉందన్నమాటే కదా!

ఈ నేపథ్యంలో లలితా సహస్రనామాలని చదవడానికున్న భయం తొలగిపోయేలా ఓ నాలుగు మంచి మాటల్ని అనుకుందాం! ఎందరో స్త్రీలకుండే మానసిక భయ ఆందోళనలని తొలగించుకుందాం!

## అమ్మ చెప్పింది

ఔనా? ‘ఈ నామాలని అందరికీ చెప్ప’ద్దని అమ్మ తనంతతానే అందా? మరి మా అనుమానం నిజమే కదా! అనుకోకూడదు.ఏ విషయాన్నైనా విన్న వెంటనే ఓ నిర్ణయానికొచ్చెయ్యకూడదు.కొద్ది బుర్రపెట్టిముందు వెనుకలాలోచించాలి. అమ్మ ఏం చెప్పిందంటే-

**న శఠాయ న దుష్టాయ, నా విశ్వాసాయ కర్హిచిత్। భవతా న ప్రదేయంస్యాత్, అభక్తాయ కదాచన॥** అని.

ఎవరైతే ఎదుటివాళ్ళ మెచ్చుకోలుకోసం “అబ్బో! ఎంత బాగుంది అని ముఖంముందు మాట్లాడి- చాటుగా ఇష్టం వచ్చినట్టు వేళాకోళంతో తమ నైజాన్ని చాటుకుంటూ ఉంటారో అదుగో అలాటి మనస్తత్వం వున్నవాళ్ళకి చెప్పద్దంది అమ్మ. నిజమే కదా!

ఇక ప్రతి విషయాన్నీ ఏదో తాము బాగా తెలివితేటలున్నవాళ్ళమని భావించుకుంటూ తాము పాటించకా- ఇతరులెవరూ కూడా ఎలా పాటించకుండా ఉండేలా చేయాలో ఆ దిశగా అందర్నీ చేయడానికి ప్రయత్నిస్తూండే దుష్ట మనస్తత్వమున్నవాళ్ళకి చెప్పద్దంది అమ్మ! తప్పేముంది ఇలా చెప్పడంలో?


కొందరికి దేనిమీదా నమ్మకముండదు! అంతా అవిశ్వాసమే ఈ సంవత్సరం ఈ దైవాన్ని కొలిచి తామనుకున్న కోరిక తీరకపోతే పైసంవత్సరం మరో దైవాన్నీ- ఆయనకూడా కోరికని తీర్చలేనివాడే అని పిస్తే- దైవంలా ఉన్నాడని ఏ కొందరో మొక్కుతూండే ఓ వ్యక్తినీ-ఆయనవల్లా ఏమీ ఫలితం లేకుంటే ఇంకెవరికి మొక్కాలా? మొక్కుదామా? అనుకుంటూ ఎవరిమీదా నమ్మకంలేని- నమ్మకం కుదరని ఈ వ్యక్తులకి ఈ నామాలని చెప్పద్దంది అమ్మ!

ఎంత అక్షరసత్యం ఈ మాట! నేరమేముంది ఇలా అనడంలో? ఇక ఏమాత్రపు భక్తి భావమూ ఉండదు కొందరిలో. అలాటివాళ్ళక్కూడా ఈ నామాలని చెప్పద్దంది అమ్మ నిష్కర్షగా! ఎందుకని ఇలా అంది?

కారణం ఒక్కటే. స్త్రీలకీ, పురుషులకీ ఉండే శరీర నిర్మాణం ఒకే తీరుగా ఉన్నా నూటికి తొంభైమంది స్త్రీలలో మానసిక భయం అనేది పురుషుల కంటే ఎక్కువగా ఉంటుంది.

అందుకే తమ సంతానం ఇంటికి రావడం కొంత ఆలస్యమైనా- ఏ విదేశాలకో విమానంలో వెళ్ళినా చేరినట్టుగా ఆ శుభవర్తమానం వచ్చేవరకూ ఆ తీరు స్త్రీలలో కలిగే మానసిక ఆందోళన అనేది మేరుపర్వతమంతటి గట్టి గుండె ఉన్న పురుషులనైనాసరే కదిలిపోయేలా చేస్తుందనేది నిజం.

అందుకే స్త్రీలని అబల అనే పేరుతో పిలిచింది శాస్త్రం. చిత్రమేమంటే తమ సంతానంగాని సకాలంలో రాకుంటే ఆమెకు వచ్చే ఆలోచనలు అన్నీ తన సంతానంమీదినుండి ఏదైనా వాహనం వెళ్ళిపోయిందా? ప్రాణ ప్రమాదానికి మరేలాగయినా గురయ్యాడా?వంటి అమంగళకరమయినవేతప్ప ఒక్క మంచి ఆలోచన రాదు.



అదుగో! అలాటి దుర్బలత్వాన్ని పోగొట్టడంకోసం అమ్మ తన ప్రతి చేష్టనీ నమోదుచేయవలసిందిగా- ఎనమండుగురు దేవతలని (వశిని అనే పేరుగల ఆమెతో ప్రారంభమైన మొత్తం ఎనమండుగురు వాక్కులో దృఢత్వం కలిగిన (నేర్పరితనంతో మాట్లాడుతూ విజయాన్ని సాధించే శక్తి ఉండి విజయాన్ని సాధించిన- వశిన్యాది వాగ్దేవతలని కోరింది.

వాళ్ళంతా అమ్మ ప్రతి కదలికనీ అంటే స్త్రీ ఎలా అలంకరించుకోవాలో, గర్భం ధరించినప్పుడు ప్రతి నెలా ఏ తీరు ఆహారాన్ని నెల పొడుగునా ఎంతెంత పరిమాణంలో స్వీకరిస్తూ ఎలాటి పండంటి బిడ్డని కనాలో, భండుడనే పేరుగల రాక్షసుడు మొదలుకుని ఎందరు రాక్షసుల్ని ఎలా స్త్రీలందర్నీ కూడగట్టుకుని యుద్ధాన్నిచేసి అలాటి వాళ్ళని మట్టుబెట్టాలో, మానసికంగా ఎలా దృఢంగా స్త్రీ ఉండాలో...

ఇలా ప్రతి నూరు నామాల్నీ ఒక్కో లక్షణానికి చెప్తూ అలాటి పది నూర్ల నామాలని (1000) లలితా సహస్రనామాలపేరిట మనకి వాళ్ళద్వారా అందింపజేసింది.

అంటే స్త్రీ జాతికుండాల్సిన మనోధైర్యం, ఆందోళన లేకుండా ఉండగలతనం, అన్యాయాన్ని ఎదిరించగల తీరుతెన్నులూవంటివాటిని అమ్మ చెప్తే- వాటిని అతిముఖ్యంగా స్త్రీలే చదవకూడదందామా? ఎంత బుద్ధిహీనతకి నిదర్శనం ఈ మాట?

## భయాలూ-సందేహాలూ

సహస్రనామాలలో ఏ తప్పు దొర్లినా అమ్మ 'నెత్తి అణుస్తుంది'-అనే మాట లోకంలో ప్రచారంలో ఉంది. అమ్మకున్న పేర్లలో ఒకటి 'సాంద్ర కరుణా!'అని. చెప్పలేనంత దట్టమైన జాలి కల్గినది' అని దీనర్థం.

ఏ తల్లైనా తన కూతురు పరమఘోరమైన కంఠధ్వనితో పాట పాడినా- కాకిపిల్ల కాకికి ముద్దు- అన్నట్టుగా భలే బాగుందనే పొగుడుతుంది, అలా కాదు ఇలా పాడి చూడు! అని సరిచేస్తుందే తప్ప నోరు మూయవలసిందిగా అన(లే)దు కదా!

అందుకే మనమెవరమైనా సహస్రనామాల్లో తప్పుగా గాని వేటినైనా ఉచ్చరిస్తే ఆ తల్లి మనని శిక్షించదు- పైగా తన నామాలని చక్కగా ఉచ్చరించగల శక్తిఉన్న ఎవరినో ఏదో చుట్టపు చూపుగా మన దగ్గరకొచ్చేలా చేసి మనం ఆమెద్వారా పటిష్ఠంగా లలితా నామాలని నేర్చుకునేలా చేస్తుందనేది ఎందరో స్త్రీలకి అనుభవంలో కన్పించిన కన్పిస్తున్న సత్యం!

అందుకని అలాటి భయం వద్దు! ఆ మాటకు వస్తే లలితా నామాలని చదివిన ప్రచారంలోకి వచ్చిన కొందర్లో తప్పులు కనిపిస్తూనేవున్నాయి. అంత మాత్రాన నిందించడం సరికాదు.

## ప్రసాదాలని ఎలా?

అమ్మ చెప్పిందొకటే- నీకు ఇష్టమైన, నీ కుటుంబంలో అందరికీ ఇష్టమైన, నీకు చేయడం కుదిరిన వంటకాన్ని సమర్పించు నైవేద్యంగా! అని. తనకిష్టమైన వాటి జాబితానికూడా ఆమే చెప్పింది-

1. పాయసాన్నప్రియా (స్వచ్ఛమైన ఆవుపాలూ, ఆవునేయీ, బెల్లం (పంచదార కాదు) బియ్యంతో (సేమ్యా మొదలైనవి కాదు) చేసిన పాయసాన్నం

2. స్నిగ్ధౌదన ప్రియా (మెత్తగా వండిన అన్నాన్ని స్వచ్ఛమైన ఆవునేతితో తడిపి చేసిన అన్నంముద్ద)

3. గుడాన్న ప్రీతమానసా (అన్నం వండాక ఆ వేడిగా ఉన్న అన్నం మీద బెల్లాన్ని (గుడం) సన్నని పొరలు పొరలుగా చేసి కొంతసేపు ఉండనిస్తే ఆ బెల్లంకరిగిన ఆ పదార్థం గుడాన్నం)

4. దధ్యన్నాసక్త హృదయా (పెరుగూ అన్నం- మనకి దేవాలయాల్లో వైష్ణవులు చేసే సంప్రదాయబద్ధమయిన విధానాన్ని తెలుసుకుని చేయాల్సిన- చేసుకోగలిగిన దధి ఓదనం (దద్ధోజనం అనకూడదు). 5. ముద్గౌదనాసక్త చిత్తా (పెసరపప్పుతో ఉడికిన అన్నం- పులగమంటారు)

6. హరిద్రాన్నైక రసికా (హరిద్ర మంటే పసుపు-దానితో కలిపిన అన్నం అంటే పులిహోర) అనేవి.

వీటిలో-ప్రతి వ్యక్తికీ ఆరోగ్య రక్షణ నిమిత్తం కావలసిన ఒక్కో పదార్థం- ఒక్కో అవయవశక్తిని పెంచే లక్షణం- ఒక్కో ప్రయోజనాన్ని సాధించే నైవేద్య విధానం దాగుంది.

వీటిలో ఏదోకదాన్ని రోజుకొక్కటి చేయచ్చుగా! లేదా నేర్చుకుని చేసుకోవచ్చుగా! వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలనేవే అమ్మవైన ఈ 10 రోజుల కంటే కూడా ముఖ్యమని అన్పిస్తే నేతి అన్నముద్ద- పులగం- పాయసాన్నం చేయడం కష్టంకాదుగా!

## చదవకూడదనేది ఎందుకు?

ఇదుగో-తప్పులు చదువుతామేమో అనే భయం- 10 రోజులపాటు పూజని చేయలేమేమోననే సంశయం- ఏదైనా తెలియని తేడాలు జరిగితే ఏమవుతుందోననే ఆందోళన- ప్రసాదాలని రోజూ చేయడం కుదరదనే అనవసర ఆలోచన-

పోనీ ప్రత్యామ్నాయం ఏమిటో తెలుసుకుందామనే ఆలోచన లేకపోవడం- వాళ్ళూ వీళ్ళూ చెప్పిన అర్థంలేని కబుర్లూవంటివన్నీ విని విని- అందరూ చదవకూడదుట! అనే ఓ మాటని అనేసి-

తాను చేయడంలేదని అందరూ అనుకునే వీల్లేకుండా- మాకు ఆ సంప్రదాయం (ఆనవాయితీ) లేదనో- అందరూ చదవకూడదట- అంటూనో తప్పించుకోవడం జరుగుతోంది.

14 లోకాల్లోని 14×84 లక్షల జీవరాసుల్ని రక్షిస్తూ ఉండే ఆమెకి ఓ 10 రోజులపాటు పూర్తి తీరుబడిఉండి మన పూజల్ని స్వీకరించి అనుగ్రహించవస్తూంటే- నాకు ఖాళీ కుదరదంటే అమ్మ నష్టపోదు.

బంగారపు గొడుగుని కష్టాల వర్షానికి ఈయబోతున్న అమ్మతో 'వద్దు వ'ద్దంటూ దూరంగా వెళ్ళిపోతూ మనమే మరింత తడుస్తున్నట్టే! అవునా?

**డా॥ మైలవరపు శ్రీనివాసరావు**